సాక్షి
అనంతపురం
బుధవారం । 12 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.20,720

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,720 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోళ్లు



అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకారం రబీలో రైతులు పండించిన పప్పుశనగ కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా రూ.5,650 ప్రకారం కొంటామన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించి ఉండాలన్నారు. 14 శాతం లోపు తేమ ఉన్న నాణ్యమైన పప్పుశనగ తీసుకురావాలని సూచించారు. ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ పాక్షికంగా రద్దు

గుంతకల్లు: ధర్మవరం రైల్వే జంక్షన్‌లో 5వ నంబర్ ప్లాట్‌ఫారం ఏర్పాటు పనుల్లో భాగంగా ధర్మవరం-మచిలీపట్నం మధ్య తిరుగుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం-మచిలీపట్నం మధ్య మాత్రమే నడుస్తున్నట్లు వెల్లడించారు. మచిలీపట్నం-ధర్మవరం(17215) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 12 నుంచి 30 వరకు, ధర్మవరం-మచిలీపట్నం (17216) ఎక్స్‌ప్రెస్‌ను 13 నుంచి 31 వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు వివరించారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు సంబంధించి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ నెలకు సంబంధించి 15న నిర్వహించాలని ముందుగా నిర్ణయించినా... పదో తరగతి పరీక్షల నేపథ్యంలో 12 (నేడు)న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులకు సమాచారం పంపా రు. డీఈఓ అన్ని కాంప్లెక్స్‌లకు ఆగమేఘాల మీద ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థుల గ్రాండ్ టెస్ట్ పరీక్షల నిర్వహణ, సన్నద్ధత, పాఠశాల వార్షికోత్సవాలు, పదో తరగతి వీడ్కోలు సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల ఇన్విజిలేషన్ డ్యూటీల్లో చాలామంది టీచర్లు ఉన్నారు. ముస్లిం టీచర్లు రంజాన్ మాసపు ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ అధికారులు ఉన్నట్లుండి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఉదయం పాఠశాలలు జరిపి మధ్యాహ్నం కాంప్లెక్స్ మీటింగ్‌లకు హాజరుకావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు సెంటర్లుగా ఉన్న పాఠశాలల విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై టీచర్లు మండిపడుతున్నారు. ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు రాయల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మండిపడ్డారు.


కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్య



రుచిత (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట కేజీబీవీలో 9వ తరగతి విద్యార్థిని పి.రుచిత (14) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు...కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన రాజేష్, మునీశ్వరి దంపతుల కుమార్తె పి.రుచిత స్థానిక కేజీబీవీలో చదువుతోంది. ఇటీవల కొంతకాలంగా కేజీబీవీలో రుచిత వ్యవహారం వేరే విధంగా ఉండేది. ఇతర అమ్మాయిలతో అతి చనువుగా ఉండేది. వారు విభేదించడంతో చేతులు కోసుకోవడం లాంటి ఘటనలకు పాల్పడింది. ఈ విషయం నాలుగు రోజుల క్రితం టీచర్ల దృష్టికి వచ్చింది. ఎస్‌ఓతో పాటు టీచర్లూ కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మార్పు రాకపోగా చేష్టలు మరింత ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో ముందు జాగ్రత్తగా తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లి మునీశ్వరిని కేజీబీవీకి పిలిపించారు. కొన్నిరోజులు ఇంట్లో పెట్టుకుని సర్దిచెప్పి పంపాలని సూచించారు. విద్యార్థిని నానమ్మ కేజీబీవీ సమీపంలో ఉండే రాధాస్వామి మందిరంలో వాచ్‌ఉమెన్‌గా ఉంటోంది. దీంతో మునీశ్వరి తన కుమార్తెను నేరుగా ఆ మందిరం వద్దకు పిలుచుకెళ్లారు. అక్కడే తండ్రి కాస్త గట్టిగా మందలించాడు. బాగా చదువుకోవాలని సూచించాడు. ఈ క్రమంలోనే ఇంటికి వెళ్లి డ్రస్సు తెస్తామని తల్లిదండ్రులిద్దరూ వెళ్లారు. వారు అలా వెళ్లగానే మందిరం కాంపౌండ్‌లో ఓ చెట్టుకు రుచిత ఉరి వేసుకుంది. రూరల్ పోలీసులు పరిశీలించి.. మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అంతులేని మోసం



- అనంతపురంలోని ఓ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ పూర్తి చేసిన హర్షవర్ధన్‌కు ఓ మల్టీనేషనల్ కంపెనీలో ఏడాదికి రూ.12 లక్షల వేతనంతో కొలువు దక్కింది. అయితే, ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగంలో చేరాలని కంపెనీ షరతు విధించింది. హర్షవర్ధన్ కాలేజీలో సంప్రదించగా.. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్య ప్రతినిధులు కొర్రీ పెట్టారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదని తెలిపారు. దీంతో హర్షవర్ధన్ చేసేదిలేక అప్పు చేసి ఫీజు కట్టి సర్టిఫికెట్లు పొందాడు.
- అనంతపురం నగరానికి చెందిన స్వాతి బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. అయినా, ఆమెకు సాఫ్ట్‌వేర్ కొలువు దక్కడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషపడ్డారు. ఈ క్రమంలోనే ఐదు, ఆరో సెమిస్టర్‌కు సంబంధించిన మార్క్స్ మెమోల కోసం కళాశాలలో సంప్రదించగా... ఫీజు బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు అందిస్తామని అక్కడ తేల్చిచెప్పారు. మార్క్స్ మెమోలు అనివార్యం కావడంతో స్వాతి తండ్రి ఐదు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి మరీ ఫీజు చెల్లించారు. కేవలం హర్షవర్ధన్, స్వాతిలే కాదు... జిల్లాలో ప్రస్తుతం వేలాది మంది విద్యార్థులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

విద్యార్థుల జీవితాలతో సర్కారు చెలగాటం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని వైనం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- అప్పు తెచ్చి మరీ కళాశాలల్లో కడుతున్న తల్లిదండ్రులు
- నాడు టీడీపీ దిగిపోయేనాటికీ ఫీజు బకాయిలు
- పిల్లలకు ఇబ్బంది కలగకుండా గొప్ప మనసుతో చెల్లించిన జగన్ సర్కారు

అనంతపురం: విద్యార్థుల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటమాడుతోంది.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 'వసతి దీవెన' జూన్ నెలలో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆ నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమ అయ్యేవి. కానీ, అధికారంలోకి వచ్చిన 'కూటమి' నిధులు చెల్లించకుండా నిలిపివేసింది. పాత విద్యా సంవత్సరంలో రెండు త్రైమాసికాలు, ఈ విద్యా సంవత్సరంలో పూర్తయిన మూడు త్రైమాసికాలకు కలిపి రూ. 90 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీనికితోడు 'వసతి దీవెన' పథకానికి కూడా చంద్రబాబు సర్కారు మంగళం పాడటం గమనార్హం.

ఫీజు కడితేనే సర్టిఫికెట్లు..

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని కళాశాలల నిర్వాహకులు తేల్చి చెబుతుండటంతో బాధిత తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారు.

2019-20 నుంచి 2023-24 వరకు ఉమ్మడి జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	105.43

వసతి దీవెన అమలు ఇలా..

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	42.37
2020-21	50,571	47.96
2021-22	50,702	45.25
2022-23	42,915	37.46

వైఎస్ జగన్ గొప్ప మనసు..

2019 మే నెలలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు విద్యార్థులకు రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచింది. 2017-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం చెల్లించి చేయూతనిచ్చింది. అలాగే, గత ఐదేళ్లు ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో నగదు జమ చేసి చదువులు సాఫీగా సాగేలా చూసింది. కానీ, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్న వారికి సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు అండ్ కో ప్రగల్భాలు పలికారని, వారిని నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

విద్యార్థులు నష్టపోయారు



కూటమి సర్కారు వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వేలాదిమంది విద్యార్థులు నష్టపోయారు. ఓవైపు విదేశీ విద్యా దీవెన లేదు, మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక సర్టిఫికెట్లు కూడా ఇవ్వని దుస్థితి. 20 లక్షల ఉద్యోగాల హామీని కూటమి సర్కారు విస్మరించింది. విద్యార్థులు, యువతకు న్యాయం జరిగేవరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాడతాం. ఇప్పటికే విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. నేడు చేసే 'యువత పోరు' చరిత్రలో నిలిచిపోతుంది.

–రమేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు

డబ్బు కట్టాకే పరీక్ష రాయించారు



ఎస్కేయూలో ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ చదువుతున్నా. ఈ అకడమిక్ ఇయర్, గత అకడమిక్ ఇయర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. గతంలో జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన ఎప్పటికప్పుడు అందింది. తాజాగా పరీక్షలు రాయాలంటే ముందస్తుగానే మెస్ బిల్లులు చెల్లించాలని చెప్పారు. మెస్ బిల్లులు చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ ఇస్తేనే సెమిస్టర్ పరీక్షలు రాయించారు.

– భరత్, లా విద్యార్థి, ఎస్కేయూ క్యాంపస్ కళాశాల

కనికరం కూడా చూపలేదు



పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు రాయాలంటే మొత్తం ఫీజు కట్టాలని షరతు విధించారు. లేకపోతే హాల్‌టికెట్లు ఇవ్వకూడదని సంబంధిత విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం ఫీజు చెల్లించి హాల్‌టికెట్ తీసుకుని పరీక్ష రాశా. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో మాకేం పని అంటూ యాజమాన్యం కనికరం లేకుండా వ్యవహరించింది.

– వి. హర్షవర్ధన్ రెడ్డి, ఎంఏ పొలిటికల్ సైన్సెస్, ఎస్కేయూ

ప్రతి నిత్యం.. ప్రజాపక్షం

- ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచిన 'వైఎస్సార్ సీపీ'
- ఉమ్మడి అనంత జిల్లాలో రైతులు, మహిళల పక్షాన ఎనలేని పోరాటాలు
- 2019లో అత్యధిక మెజారిటీతో అధికారంలోకి..
- సీఎంగా పాలన అంటే ఇలా ఉండాలని చూపించిన జగన్
- నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు వచ్చాయి తర్వాత కాలగర్భంలో కలిసిపోయాయి. దేశాన్ని శాసించిన జాతీయ పార్టీలు సైతం ఏపీలో గల్లంతయ్యాయి. కానీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించి నిలబడ్డ పార్టీ ఏదైనా ఉందంటే అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే. "పార్టీ అంటే ప్రజలు.. పాలకులంటే ప్రజలే" అంటూ సరిగ్గా 14 ఏళ్ల క్రితం 2011 మార్చి 12న ఆవిర్భవించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీ రాజకీయాల్లోనే కాదు దేశ రాజకీయాల్లోనే పెను సంచలనంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రజా వ్యతిరేక పాలనకు ఎదురొడ్డి పోరాడిన పార్టీగా వైఎస్సార్ సీపీ ముద్ర వేసుకుంది.

కష్టాలొచ్చినా ఎదురొడ్డి..

పార్టీ అధ్యక్షుడి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పోరాటం ఇప్పటికీ అట్టడుగు వర్గాల్లోనూ చిరస్థాయిగా నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల తరఫున కూడా ఆయన ఎన్నో పోరాటాలు చేశారు. 'అనంత' రైతుల ఆక్రందనలపై 2014-19 కాలంలో అసెంబ్లీలో గళమెత్తారు. రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల తరఫున నిలబడ్డారు. డ్వాక్రా మహిళల అభ్యున్నతి కోసం శ్రమించారు. 2014లో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వం చేసిన కుట్రలను దీటుగా ఎదుర్కొన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసిన తీరును ఎండగట్టారు. చివరకు సుదీర్ఘ పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజా సమస్యలను విని విజయానికి చేరువయ్యారు.

పాలన అంటే ఇలా ఉండాలని..

2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలు గెలిచింది. సాధారణంగా ఎన్నికలముందు హామీలివ్వడం, ఆ తర్వాత తుంగలో తొక్కడం చూసి ఉంటాం. కానీ పాలన చేపట్టిన రోజు నుంచే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూ.చ.తప్పకుండా జగన్ అమలు చేశారు. జిల్లాలో లక్షలాది మంది రైతులకు చెప్పిన తేదీకే 'రైతు భరోసా' అందించారు. డ్వాక్రా మహిళలకు 'ఆసరా', 'సున్నా వడ్డీ'తో అండగా నిలిచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులను ఆదుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యానికి పునరుజ్జీవం పోశారు. పాలన వికేంద్రీకరణ జరిగితేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని గ్రామ వార్డు సచివాలయాలు తెచ్చారు. ఈ క్రమంలో జిల్లాలో వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలొచ్చాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పెనుకొండకు మెడికల్ కాలేజీ, అనంతపురంలో ఎంసీహెచ్ బ్లాకు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు ఇలా ఒకటేమిటి ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత జగన్‌దే. అయితే, ప్రజలను ఎలాగోలా మభ్యపెట్టి 9 నెలల క్రితం గద్దెనెక్కిన చంద్రబాబు.. వచ్చీ రాగానే విద్యార్థులు, రైతులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నేడు శ్రేణులు 'యువత పోరు'కు శ్రీకారం చుట్టాయి.




వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యం

పేద, సామాన్య మధ్య తరతగతి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కృషి చేశారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ఏర్పాటైన పార్టీ వైఎస్సార్ సీపీ. మహానేత తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీని ఏర్పాటు చేసి 14 ఏళ్లు అయ్యింది. 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజానీకం అఖండ విజయాన్ని అందించింది. గత ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా నిలిచింది. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్ సుపరిపాలన అందించారు. రూ.లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

'యువత పోరు'ను జయప్రదం చేద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: 'విద్యార్థులు, యువతను కూటమి ప్రభుత్వం దగా చేసింది. ఈ క్రమంలో సర్కారు మెడలు వంచడమే ధ్యేయంగా బుధవారం చేపడుతున్న వైఎస్సార్ సీపీ 'యువత పోరు' ర్యాలీని జయప్రదం చేయాలి' అని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం సమీపంలోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై సప్తగిరి సర్కిల్, సూర్యనగర్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు,పెద్ద ఎత్తున యువత కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని, 'విద్యా దీవెన' పథకం ద్వారా ఐదేళ్లలో రూ. 12,612 కోట్లు, 'వసతి దీవెన' ద్వారా రూ. 5,992 కోట్లు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రూ.4,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పిన చంద్రబాబు.. సీఎం అయ్యాక మాట తప్పారన్నారు. రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే, కూటమి ప్రభుత్వంలో వాటిని ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో 'కూటమి' ఆగడాలను తిప్పికొడతామని 'అనంత' స్పష్టం చేశారు.

హంస వాహనంపై వీణాపాణి



వీణాపాణి అవతారంలో హంసవాహనంపై శ్రీవారు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు మంగళవారం రాత్రి వీణాపాణిగా హంసవాహనంపై చదువుల తల్లి సరస్వతి అవతారంలో తిరుమాడ వీధుల్లో దర్శనమిచ్చారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించి తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తజనం తన్మయత్వం చెందారు. నారసింహుడు హంస వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో దర్శనమివ్వడం ద్వారా భక్తులలో అహంభావాన్ని తొలగించి శరణాగతిని కల్గిస్తాడని అర్చక పండితులు తెలిపారు. పరమాత్మ వేదోపదేశాన్ని హంస రూపంలోనే చేసినందున తుచ్ఛమైన కోర్కెల అంధకారం వీడి శాశ్వతమైన పరబ్రహ్మ చెంతకు చేరే ముక్తిమార్గం వైపు నడవాలని ఈ హంసవాహనం ద్వారా స్వామివారు తన భక్తులకు చాటిచెబుతారని అర్చకులు వెల్లడించారు. ఉభయదారులుగా పట్టణానికి చెందిన తోటంశెట్టి రాజుగోపాల్‌శెట్టి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు సింహవాహనంపై శ్రీవారి దర్శనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాటమరాయుడు బుధవారం మాడవీధుల్లో సింహవాహనంపై దర్శనమివ్వనున్నారు. మనుషులలో జంతు స్వాభావికమైన ప్రవృత్తిని అదుపు చేసుకోవాలని లోకానికి చాటిచెప్పడానికే శ్రీవారు సింహవాహనంపై ఊరేగుతారని భక్తుల నమ్మకం. అర్చకులు ఉదయం యాగశాలలో పుణ్యాహవచనం జరిపి వాస్తు, అగ్ని ప్రతిష్ట చేస్తారు. రాత్రివేళ స్వామివారు తిరువీధుల్లో విహరించనున్నారు.

తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోండి

- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను కలిపి మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తారు. ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోవాలి. గతంలో చదివిన పాఠశాల కావాలా లేక మోడల్ ప్రైమరీ స్కూల్ కావాలా ఆరా తీయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విద్య, అనుబంధ శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ అంశంపై ఎంఈఓలు గ్రామపంచాయతీ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ విధానాలను వివరించాలన్నారు. అక్కడ తీసుకున్న నిర్ణయాలను లిఖితపూర్వకంగా ఆమోదం పొందేలా చూడాలన్నారు. మండల, క్లస్టర్ కమిటీల ఏర్పాటు, పాఠశాల నిర్వహణ కమిటీతో సంప్రదించి తల్లిదండ్రుల అంగీకారంతో పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఇబ్బందులున్న ప్రాంతాల్లో బేసిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని, మూడు కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాలలు లేనిచోట ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా సదుపాయం లేని ప్రాంతాల్లో ఆ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలను ప్రజాప్రతినిధులు, డిప్యూటీ డీఈఓ, డీఈఓ స్థాయిలో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా యూడైస్ డేటా ప్రకారం పోస్టుల కేటాయించాలన్నారు. సమావేశంలో డీఈఓ ప్రసాద్‌బాబు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శైలజ, గిరిజన సంక్షేమ అధికారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టాప్–6లో ఉండాలి

పంచాయతీ సెక్ట్, జీఎస్‌డబ్ల్యూఎస్ తదితర అంశాల్లో జిల్లా టాప్–6లో ఉండేలా పనిచేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుందని, అప్పటిలోగా రాష్ట్రస్థాయిలో ఆయా అంశాల్లో జిల్లాను టాప్–6లో ఉంచేందుకు కృషి చేయకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి ప్రతిభా పురస్కారం


అవార్డు అందుకుంటున్న రామాంజినేయులు

తాడిపత్రి: కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని విశిష్టమైన వ్యక్తులు అందజేసే పురస్కారం ఈ ఏడాదికి గాను తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రామాంజినేయులుకు దక్కింది. ఈ నెల 9న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరిగిన పురస్కారాల ప్రదానంలో శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని ఆయనకు హైదరాబాద్ శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇటికాల వీరయ్య, తెలంగాణ మాజీ డీజీపీ పూర్ణచంద్రారావు అందజేసి, ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాఠశాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించినందుకు 2018లోనూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామాంజినేయులు అవార్డు అందుకున్నారు. వృత్తితో పాటు అనేక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన పాలుపంచుకుంటున్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ శాలివాహన ఉన్నతాధికారులు, ట్రస్ట్ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు 'షోకాజ్'

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసేందుకు వెళ్లిన సమయంలో కొందరు ఉద్యోగులు ఉదయం 10 గంటలవుతున్నా విధులకు హాజరు కాలేదు. అంతేకాక ప్రభుత్వం చేపట్టిన సర్వేలోనూ ఊబిచెర్ల సచివాలయ ప్రగతి వెనుకంజలో ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. దీంతో తనిఖీలకు వెళ్లిన ఆయన తొలుత రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించారు. ఇద్దరు మినహా మిగిలిన ఉద్యోగులు ఎవరూ విధులకు హాజరు కాలేదు. గైర్హాజరైన వారికి ఫోన్ చేసి సంప్రదించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో సదరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఊరేగింపులో అపశ్రుతి


మృతుడు ముస్తఫా

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికి గ్రామంలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన శేష వాహనం ఉత్సవంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముస్తఫా(18) ఊరేగింపులో తన మిత్రులతో కలసి చిందేస్తూ ఉన్నఫళంగా కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు.

జిల్లా రైతులపై కూటమి కుట్ర

- గాలేరు-నగరి ద్వారా కుప్పంకు నీరు తీసుకెళ్లొచ్చు
- జిల్లా రైతులను ఇబ్బంది పెట్టేందుకే హంద్రీ-నీవాకు లైనింగ్ పనులు
- రైతు సదస్సులో విశ్వేశ్వరరెడ్డి


సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి, నాయకులు


సమావేశంలో పాల్గొన్న రైతులు

కూడేరు: ఉమ్మడి అనంత జిల్లా రైతులపై సీఎం చంద్రబాబు కక్షకట్టి హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. గ్రావిటీ ద్వారా కుప్పం ప్రాంతానికి గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను తీసుకెళ్లే అవకాశమున్నా... కాదని జిల్లా రైతాంగం సంక్షేమాన్ని కూటమి సర్కార్ కాలరాస్తోందన్నారు. మంగళవారం కూడేరులోని శివరావు కల్యాణమంటపం వేదికగా హంద్రీ-నీవా కాలువ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుడు, ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన 'రైతు సదస్సు' జరిగింది. సదస్సులో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు స్వార్థానికి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. గత ప్రభుత్వంలో గాలేరు-నగరి ద్వారా కుప్పం ప్రాంతానికి నీరందించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకుని 75 శాతం పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. మిగిలిన పనులు పూర్తి చేస్తే జగన్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులకు టెండర్లు పిలిచారన్నారు. సుమారు రూ.736 కోట్లతో పూర్తయ్యే లైనింగ్ పనులకు రూ.200 కోట్లు అధికంగా పెంచి టెండర్లను తన అనుయాయులకు కట్టబెట్టారని మండిపడ్డారు. ఈ పనులు పూర్తయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీ-నీవా కాలువ ద్వారా 3.5లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం నీరుగారిపోతుందన్నారు. లైనింగ్ పనులతో కాలువ గుండా ప్రవహిస్తున్న నీరు భూమిలోకి ఇంకదన్నారు. పక్కలకు ఊట రాదన్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటి లభ్యత పూర్తిగా తగ్గి పండ్ల తోటలు, ఇతర పంటలు సాగు చేసుకునే రైతులు తీవ్రంగా నష్ట పోతారన్నారు. భూములు బీళ్లుగా మారుతాయన్నారు. భవిష్యత్‌లో కాలువ వెడల్పు చేయడానికి అవకాశముండదన్నారు. లైనింగ్ పనులు ఆపాలని రైతులే వేడుకుంటున్నా... ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండడం దుర్మార్గమన్నారు. కుప్పం ప్రాంతానికి హంద్రీ-నీవా ద్వారానే నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే ముందుగా కాలువను వెడల్పు చేస్తే ఉమ్మడి అనంత జిల్లా రైతులు స్వాగతిస్తారన్నారు. జిల్లా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైన లైనింగ్ పనులు ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆత్మహత్యలే శరణ్యం

హంద్రీ నీవా కాలువకు కాంక్రీట్‌తో లైనింగ్ పనులు పూర్తయితే ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని రైతులు, రైతు సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సదస్సులో జయపురం, ఎంఎంహళ్లి, చోళసముద్రం, పి.నారాయణపురం, తిమ్మాపురం, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. హంద్రీ నీవా కాలువ పరిధిలో రూ.లక్షల్లో పెట్టుబడితో వివిధ రకాల పంటలు, పండ్ల తోటలను సాగు చేస్తున్నామన్నారు. కాలువకు లైనింగ్ పనులు చేపడితే భూగర్భ జలాలు అడుగంటి పోయి బోరు బావులో నీటి మట్టం తగ్గి పంటలు సాగు చేసుకోలేక నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ ప్రభుత్వం తమకు మేలు చేయకపోయిన పర్వాలేదని, నష్టం కల్గించే చర్యలు చేపట్టకుండా ఉంటే చాలన్నారు. హంద్రీ-నీవా కాలువ పరిరక్షణకు కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధార్థ, మండల అధ్యక్షుడు సిద్దారెడ్డి, ఏపీ రైతు సంఘం మండల నేతలు నారాయణరెడ్డి, వీరప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, నేతలు రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, రామ్మోహన్, క్రిష్టప్ప, గంగాధర్, నరేష్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తీర్మానాల్లో రాజకీయ జోక్యం

- టీడీపీ నాయకులు చెబితేనే సిద్ధం చేస్తామంటున్న అధికారులు
- ప్రొటోకాల్ ధిక్కరించి టీడీపీ నేతలు ప్రతిపాదించిన తీర్మానాలకు ఆమోదం


తీర్మానాల కోసం మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కార్యాలయంలో వేచి చూస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధి పనుల్లో టీడీపీ నేతల జోక్యం తారస్థాయికి చేరుకుంది. ప్రజాప్రతినిధులను కాదని టీడీపీ నేతలు సూచించిన పనులకే అధికారులు సైతం తీర్మానాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. తాజాగా వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు తీర్మానాలు రూపొందించాలని అధికారులను ఆత్మకూరు ఎంపీపీ సుబ్బర హేమలత కోరారు. తీర్మానాల కోసం మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ కార్యాలయంలోనే ఆమె వేచి చూసినా ఫలితం లేకపోయింది. చివరకు టీడీపీ నేతలు సూచించిన పనులకు సంబంధించి 30 తీర్మానాలను సిద్ధం చేశారు. వీటిలో ప్రజాప్రతినిధులు సూచించిన ఏ ఒక్క పని కూడా లేకపోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న ఎంపీపీ హేమలత... అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు చెబితేనే తీర్మానాలు సిద్ధం చేస్తామని చెప్పడం సబబు కాదని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పరిష్కారం చూపే దిశగా గత వారం సమావేశం ఏర్పాటు చేసి ముందస్తు సమాచారం ఇచ్చినా ఏ ఒక్క అధికారి కూడా సమావేశానికి హాజరుకాలేదన్నారు. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.50 లక్షలకు పైగా ఉన్నా... వాటితో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండానే తీర్మానాలు రూపొందించి, ఆమోదం తెలిపినట్లుగా రికార్డులు సిద్ధం చేస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు రాజకీయ పార్టీల నేతల కనుసన్నల్లో పనిచేయాల్సి రావడం సిగ్గుచేటన్నారు. ఈ అంశంపై కలెక్టర్ స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: జిల్లాలోని బీసీ, ఈబీసీ (కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు) మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న మహిళలు ఈ నెల 22వ తేదీలోపు సచివాలయాలు, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణా కాలంలో 75 శాతం హాజరు ఉన్న వారికి ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తారు.

కార్మికులను మోసగిస్తున్న ప్రభుత్వం

- వేతన బకాయిల కోసం ఏడాదిలో మూడు సార్లు ధర్నాలు చేయాలా?
- సరైన బడ్జెట్ కేటాయించి జీతభత్యాలు సక్రమంగా చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

అనంతపురం అర్బన్: వేలాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులను ప్రభుత్వం దగా చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు మండిపడ్డారు. కార్మికులకు 10 నెలల వేతనం, 35 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతన, పీఎఫ్ బకాయిల మంజూరుతో పాటు లీటర్ బేస్ విధానం రద్దు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం కలెక్టరేట్ ఎదుట శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నిరసన తెలిపారు. ఓబులు మాట్లాడుతూ... శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కింద 600 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వేతనాల కోసం ఏడాదిలో మూడు దఫాలు సమ్మెలు చేయాల్సి వస్తోందన్నారు. సరైన బడ్జెట్ కేటాయించి కార్మికులకు వేతనం, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన లీటర్ బేస్ విధానం కారణంగా నీటి సరఫరాలో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అయితే వీటికి కార్మికులను బాధ్యులను చేస్తూ ఒక్కొక్క కార్మికుడికి రూ.2,500 చొప్పున వేతనంలో కోత విధించడం సబబు కాదన్నారు. సరైన వసతులు కల్పించని కారణంగా తలెత్తుతున్న ఈ వైఫల్యానికి తొలుత ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఆ తరువాత చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఈఈలు, డీఈఈ వరకు అధికారులను ఎందుకు బాధ్యులను చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం డీఆర్ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి నీటి సరఫరా పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాము, నాయకులు హొన్నూరు స్వామి, ప్రభాకర్, సోము, చిక్కన్న, హనుమంతరాయ, నాగేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

సజ్జలకాలువలో రైతు ఆత్మహత్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం సజ్జలకాలువ గ్రామానికి చెందిన రైతు కేశవనాయుడు (60) ఆత్మహత్య చేసుకున్నాడు. వివిధ పంటల సాగు చేసేందుకు పలువురి వద్ద రూ. లక్షల్లో అప్పులు చేసిన ఆయన... పంటల సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని భట్టువానిపల్లి, పాలవాయి గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. భట్టువాని పల్లిలో సహజసిద్ధ వ్యవసాయం (న్యాచురల్ ఫార్మింగ్) చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు. సహజంగా పండించిన పంటలకు ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని వ్యవసాయ అధికారులను రైతులు కోరారు. రబీలో రైతులు పండించిన పంటలు వేరుశనగ, మొక్కజొన్న పంటలకు దళారుల బెడద తప్పించి ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, మండల వ్యవసాయ అధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు

'మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

అనంతపురం అగ్రికల్చర్: మామిడి తోటలు పిందె దశలో ఉన్నందున మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానశాఖ ఉమ్మడి జిల్లా అధికారులు జి.చంద్రశేఖర్, బీఎంవీ నరసింహారావు తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పిందె రాలడం, బంక కారడం, నల్లతామర, రసంపీల్చు పురుగులు, తేనె మంచు పురుగు ఆశించి నష్టం కలిగించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వారం లేదా ఐదు రోజులకోసారి నీటి తడులు ఇవ్వాలన్నారు. రసంపీల్చుపురుగు జాతికి చెందిన నల్లతామరను సకాలంలో నివారించుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. నివారణలో భాగంగా తోటలో కలుపు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎకరాకు 40 నుంచి 50 నీలి లేదా తెలుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పూత ప్రారంభ దశ నుంచి మొదట వేప సంబంధిత మందులు పిచికారీ చేయాలన్నారు. అందులో 2 మి.లీ అజాడిరక్టిన్ (పది వేల పీపీఎం) లేదంటే 3 మి.లీ 1,500 పీపీఎం లేదా 3 వేల పీపీఎం ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే 7.5 గ్రాములు పొంగానియా లేదా నీమ్ సోప్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే 5 గ్రాములు బవేరియా బాసియానా లేదా లేకానిసిల్లియం లేకాని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వీటన్నింటికీ నల్లతామర అదుపులోకి రాకపోతే చివరగా 2 మి.లీ ఫిప్రొనిల్ లేదా 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రాములు థయామిథాక్సామ్ లేదా 1 మి.లీ స్పైరోటేట్రామెట్ లేదా 1 మి.లీ స్పైనోటోరం లేదా 1 మి.లీ ఫ్లూక్సా మెటామైడ్ మందులు మార్చి మార్చి రెండు మూడు దఫాలుగా పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.10.05 లక్షల నగదు, పల్సర్ బైక్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: ఆలయ నిర్మాణానికి పోగు చేసిన మొత్తాన్ని దొంగలించిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10.05 లక్షల నగదు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి వెల్లడించారు. కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామంలో సీతారామాంజినేయులు ఆలయ నిర్మాణం కోసం గ్రామస్తులు చందాల రూపంలో పోగు చేసిన రూ.12 లక్షలను గుర్రం లక్ష్మన్న అనే వ్యక్తి వద్ద భద్రపరిచిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని దుండగులు అపహరించారు. ఘటనపై ఈ నెల 4న కణేకల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

పాములు పట్టుకుంటూ ..

తమిళనాడుకు చెందిన గురునాథం రాజు.. బాతులు మేపుతో జీవనం సాగించేవాడు. గురునాథానికి వరుసకు మేనమామ అయిన జానయ్య ఇటుకల బట్టీలో పని చేస్తుండేవాడు. వీరి తల్లిదండ్రులు ఊరూరా తిరుగుతూ గ్రామాల్లో పాములు ఆడిస్తూ జీవనం సాగించేవారు. తమిళనాడు బాతులు మేపుతున్న సమయంలోనే అక్కడే వీరికి కార్తీక్ అనే యువకుడు పరిచయమై, మంచి స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో వలస వచ్చిన ముగ్గురూ గత 20 రోజులుగా కణేకల్లు మండలంలో మోటార్ సైకిల్‌పై గ్రామాల్లో సంచరిస్తూ ఊరు చివర గుడారాలు వేసుకుని రెండు, మూడు రోజులు అక్కడే ఉంటూ పాములు ఆడిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆలయాల్లో హుండీలను అపహరించి, అందులోని భక్తుల కానుకలనూ అపహరించేవారు.

దారిన పోతూ చోరీ

ఈ నెల 2న కర్ణాటక ప్రాంతానికి వెళ్లిన గురునాథం రాజు, జానయ్య, కార్తీక్... రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి సమయంలో సొల్లాపురం వద్దకు చేరుకున్న వారికి గుర్రం లక్ష్మన్న అనే వ్యక్తి తాళం వేసిన ఇల్లు కనిపించడంతో పథకం వేసి 3వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇనుపరాడ్‌తో తలుపు తాళాలు మెండి లోపలకు ప్రవేశించారు. స్క్రూడ్రైవర్ సాయంతో బీరువా తెరిచి అందులో ఉన్న రూ.12 లక్షల నగదు అపహరించారు. చోరీ అనంతరం జీడిపల్లి డ్యామ్ చేరుకుని రూ.50 వేలను జానయ్య తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయాడు. మిగిలిన డబ్బు తర్వాత పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయడంతో భయపడి కర్ణాటకలోని సిరిగుప్పకు మకాం మార్చేందుకు మంగళవారం జీడిపల్లి డ్యామ్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు గుర్తించి కణేకల్లు క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. గురునాథం రాజుపై వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల, కర్నూలు జిల్లా హాలహర్వి పీఎస్ల పరిధిల్లో చోరీ కేసులు ఉన్నాయి. తమిళనాడులోని పోలూరు, శ్రీపెరంబూరు పీఎస్‌ల పరిధిల్లోనూ ద్విచక్రవాహనాల అపహరణ కేసులు, కర్ణాటకలోని బొమ్మనహళ్లి, ఏపీలోని వి.కోట పీఎస్ పరిధిలోనూ మోటార్ సైకిళ్ల చోరీ కేసులు ఉన్నాయి. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన కళ్యాణదుర్గం డీఎస్పీ పి.రవిబాబు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్‌ఐ నాగమధు, డి.హీరేహాళ్ ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డిను ఏఎస్పీ అభినందించారు.

ఆకట్టుకున్న కర్రసాము


కర్రసాము పోటీల్లో పాల్గొన్న యువకుడు

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కర్రసాము పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన యువకులు పోటీ పడగా, యాడికి గ్రామానికి చెందిన నాగార్జున ప్రథమ, శివకుమార్ ద్వితీయ, మహేష్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి వద్ద ఉన్న సేవాగఢ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26వ విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, బ్యాక్‌లాగ్ కోటా కింద 6, 7, 8, 9వ తరగతులలో నూతన ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ ఫయాజ్ అహమ్మద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతిలో 80 సీట్లు భర్తీ చేయనున్నారు. ఎస్టీలకు 78శాతం, ఎస్సీలకు 12శాతం, బీసీలకు 5శాతం, ఓసీలకు 2శాతం, ఏఈక్యూ కోటాకు 3శాతం రిజర్వేషన్ ఉంటుంది. ఎస్టీ బ్యాక్‌లాగ్ కోటా కింద 6వ తరగతిలో 49, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోపు https://twreiscet.apcfss.in/వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 6న రాత పరీక్ష నిర్వహించి, ప్రతిభ చాటిన వారికి అడ్మిషన్లు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 98853 69079, 89782 39363లో సంప్రదించవచ్చు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బెళుగుప్ప: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వెంకటేశులుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ మంగళవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేసేవాడని బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

టీడీపీ మహిళా నేత దుశ్చర్య

ఆత్మకూరు: అందరూ చూస్తుండగా టీడీపీ మహిళా నేత రెచ్చిపోయారు. పాత కక్షల నేపథ్యంలో ఓ మహిళ జుట్టు కత్తిరించి ఉడాయించారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన మేనక, తిరుపాల్ రెడ్డి దంపతులు వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం మేనక తన ఇంటి ముందు ఉన్న ఆవుకు మేత వేస్తుండగా అక్కడకు టీడీపీ మహిళా నేత అలివేలమ్మ చేరుకున్నారు. మేనకను దుర్భాషలాడుతూ కింద పడేసి బూటు కాళ్లతో తన్నుతూ తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న కత్తెర తీసి ఆమె జుట్టు కత్తిరించి, తాపీగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న తిరుపాల్‌రెడ్డి పొలం నుంచి ఇంటికి చేరుకుని ఘటనపై ఆరా తీశాడు. అనంతరం భార్యతో కలసి ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి, ఇంటికి పిలుచుకొచ్చారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కాగా, అలివేలమ్మ స్వగ్రామం బి.యాలేరు అయినా కొంత కాలంగా అనంతపురంలో నివాసముంటున్నట్లుగా తెలిసింది. మేనక, అలివేలమ్మ మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ కారణంగా తమ పార్టీ అధికారంలో ఉన్న ప్రస్తుత రోజుల్లో తానేమీ చేసినా చెల్లుబాటు అవుతుందని భావించిన ఆమె ఈ దుశ్చర్యకు పాల్పడినట్లుగా బాధితురాలు వాపోయింది. పక్కా ప్లాన్ వేసుకున్న ఆమె బూట్లు ధరించి, ముఖానికి మాస్క్ కట్టుకుని వచ్చి దాడి చేసినట్లుగా వివరించింది.

క్లుప్తంగా

ప్లానింగ్ కార్యదర్శికి నివాళి



విజయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ప్లానింగ్ కార్యదర్శిగా పని చేస్తూ అకాల మరణం పొందిన విజయలక్ష్మి చిత్రపటానికి మంగళవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ విజయలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జీవితం చాలా చిన్నదని క్షణికావేశంతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులు ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ చంద్రశేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, అబూసలేహా, వెంకటరమణ, శేఖర్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం మృతుని నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో నేడు వేలంపాట

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం కొబ్బరి చిప్పలు సేకరించుకును హక్కు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాబు మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనవచ్చని కోరారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ



ఆత్మకూరులో మానవహారంగా ఏర్పడిన మహిళలు

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, వారు అనుకుంటే సాధించలేనిది ఏం లేదని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి 23 గ్రామాల నుంచి 325 మంది సస్యమిత్ర సంఘాల సభ్యులు హాజరయ్యారు. ముందుగా భారీగా ర్యాలీ నిర్వహించి ఆత్మకూరు ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళల నాయకత్వం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఏకాలజీ సంస్థ ప్రతినిధులు భాస్కర్‌బాబు, బ్రహ్మేష్, వీరభద్రారెడ్డి, శివశంకర్, ప్రియాంక, సబిహా తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: సచివాలయ సిబ్బంది సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు చర్మకారులు, చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో చర్మకారుల వృత్తి చేస్తున్న వారి వివరాలను లెదర్ ఆర్టిసన్స్ సర్వేలో నమోదు చేయాలన్నారు. చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఏపీ సేవా పేమెంట్ చార్జెస్‌పై డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు.

డ్వాక్రా రుణం విషయంలో పరస్పర దాడులు

అనంతపురం: డ్వాక్రా రుణం చెల్లింపు విషయంలో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. నాలుగో రోడ్డు బీబీ ఫాతిమా మకాణం సమీపంలో నివాసం ఉంటున్న కే శాంతమ్మ డ్వాక్రా గ్రూపులో 2.5 లక్షల అప్పు తీసుకున్నారు. డ్వాక్రా సభ్యురాలు సర్వే నరసమ్మ ఆమె భర్త పరుశురాంతో కలిసి మంగళవారం శాంతమ్మ ఇంటి దగ్గరకు వెళ్లి అప్పు చెల్లించాలని కోరారు. దీంతో ఆమె వారిద్దరిపై దాడి చేసింది. ఇదిలా ఉండగా అప్పు అడగడానికి వచ్చి ఐదో రోడ్డుకు చెందిన సర్వే నాగమణి, పరుశురామ్, లక్ష్మన్న, సుధాకర్ తమపై దాడి చేశారని శాంతమ్మ ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కే. శాంతిలాల్ తెలిపారు.

యువత పోరుకు తరలిరండి

అనంతపురం కార్పొరేషన్: యువతను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం మెడలు వంచేందుకు వైఎస్సార్ సీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలిరావాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు భృతి అందిస్తామని సీఎం చంద్రబాబు యువతను మోసం చేశారన్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజుల కోసం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఒత్తిళ్లు చేస్తుండటంతో వాటిని తాళలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న 17 కళాశాలలకు శ్రీకారం చుడితే, ఎక్కడ పేదలు ఉన్నత విద్యను చదువుతారన్న కక్షతో కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే కుట్ర సాగుతోందన్నారు. ఫీజు పోరు, యువత పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేటర్లు గురుశేఖర్ బాబు, రమణ, అనిల్‌కుమార్ రెడ్డి, మల్లెమీద నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు జయప్రదం చేద్దాం

విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీ పిలుపుమేరకు యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రూ.4,600 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

అనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లో చదివే ఉన్నత విద్యార్థులకు ఐదు త్రైమాసికాలకు సంబంధించి రూ.4,600 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టనున్న 'యువత పోరు'కు సంబంధించిన పోస్టర్‌ను ఎస్కేయూలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకుని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని కోరారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు చిగండి రమేష్, హేమంత్‌కుమార్, బల్లిబోయిన సురేష్, ఆది, రవి, భరత్, సురేష్, శ్రీనివాస్, హర్షవర్ధన్ రెడ్డి, రామ్ సాగర్, అరవింద్, చక్రి, రంగస్వామి నాయక్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సత్తా చాటుతాం

అనంతపురం కార్పొరేషన్: యువత పోరులో యువత సత్తా ఏంటో చూపుతామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వారు సాక్షితో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దగాను ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పికొట్టేందుకు పార్టీ అధిష్టానం సిద్ధమైందన్నారు. అధిష్టానం ఆదేశానుసారంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే యువత పోరులో భారీ ఎత్తున యువతను సమీకరించబోతున్నామన్నారు. ఎన్నికలకు ముందు విద్యార్థులకు అండగా ఉంటామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం విద్యార్థులను ముంచిందన్నారు. న్యాయబద్ధంగా విద్యార్థులకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర వాటిని విస్మరించిందన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత పోరులో విద్యార్థులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



సాకే చంద్రశేఖర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు



చంద్రశేఖర్ యాదవ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

పీఎఫ్ ఫైళ్లను పెండింగ్‌లో పెట్టొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్ సహా మండల పరిషత్ కార్యాలయాలతో పాటు ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ ఫైళ్లను పెండింగ్ పెట్టొద్దని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య ఆదేశించారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏఓలు రత్నాబాయి, విజయభాస్కర్‌రెడ్డి, కమ్మ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ సలీంతో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. పీఎఫ్‌కు సంబంధించిన ఫైళ్ల అంశంపై సమీక్షించారు. ఇక ఫైళ్ల క్లియరెన్స్‌ను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం తనకు ఫైళ్లు పెట్టాలని, రెండ్రోజుల్లో పరిశీలించి బుధవారంలోగా వెనక్కి ఇచ్చేస్తానని తెలిపారు.

రేపు మొల్లమాంబ జయంతి

అనంతపురం రూరల్: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10. 30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, మేధావులు, కవులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వివిధ రాష్ట్రస్థాయిలో హోదాల్లో నియమితులైన నాయకులు మంగళవారం అనంతను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అనంత మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పార్టీ కష్టనష్టాల్లో తోడుగా ఉన్న మీకు మరోసారి మంచి హోదాను కల్పించిందని, దీంతో మీపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుదామన్నారు. కూటమి ప్రభుత్వం 9 నెలల కాలంలో ప్రజలకు ఏమీ చేయలేదని, వైఎస్సార్ సీపీ శ్రేణుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ కృష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శి కేవీఎల్ దేవి, భూమిరెడ్డి జాహ్నవి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శంకరయ్య, కార్యదర్శి కట్టుబడి తానీష, తదితరులున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, సైఫుల్లాబేగ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



అనంతను సన్మానిస్తున్న మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ కృష్ణవేణి, కార్యదర్శి దేవి

విద్యా రంగ సమస్యలపై 15న నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలపై ఈనెల 15న విజయవాడలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి కావొస్తున్న రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యలో పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇప్పటిదాకా విడుదల చేయలేదన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేయడం కోసమే ఫీజు బకాయిలు చేయకుండా కుట్ర పన్నుతోందన్నారు. ఈ విధానాన్ని పసంహరించుకొని పెండింగ్ ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమైన కామన్ పీజీ సెట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఈనెల 15న విజయవాడలో తలపెట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షులు సాయి, విజయ్, నాగభూషణ, రాకేష్, మనోజ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరీక్షల విధుల నుంచి మినహాయించండి : యూటీఎఫ్

అనంతపురం ఎడ్యుకేషన్: దీర్ఘకాలిక (క్యాన్సర్, గుండె, నరాల, కిడ్నీ, వెన్నెముక తదితర) వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను, ప్రత్యేక అవసరాలు కలిగిన (ఫిజికల్ ఛాలెంజ్డ్) ఉపాధ్యాయులు, చంటి బిడ్డ తల్లులు, గర్భిణులైన ఉపాధ్యాయులను ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల విధుల నుంచి మినహాయించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న వారిని వైద్యుల సూచన మేరకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులను కూడా పరీక్షల విధుల నుంచి తప్పించాలన్నారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా పాఠశాల సీనియర్ సహాయకులను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 300కు పైగా ఉన్న పరీక్షా కేంద్రాలకు అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని, గతంలో ఆరోపణలు వచ్చిన ఉపాధ్యాయులను పరీక్షల విధులకు నియమించరాదని కోరారు. పని చేస్తున్న పాఠశాలల నుంచి 8 కిలోమీటర్లు దాటి పరీక్షల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు టీఏ, డీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా కార్యదర్శులు ప్రమీల, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, నాయకులు ఆదిశేషప్ప, శ్రీనివాసులు, దస్తగిరి, ఓబులపతి ఉన్నారు.

'బాలకృష్ణప్రసాద్ వంటి గాయకులు మళ్లీ పుట్టరు'

అనంతపురం కల్చరల్: గాంధర్వ స్వరంతో తెలుగు జాతిని ఉర్రూతలూగించిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ వంటి గాయకులు మళ్లీ పుట్టడం అరుదు అని త్యాగరాజ సంగీత సభ అధ్యక్షుడు ఎన్సీ సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం త్యాగరాజ సంగీత సభ సభ్యులు బాలకృష్ణ ప్రసాద్ మృతికి అశ్రునివాళులర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థానగాయకుడిగా ఆయన అందించిన సంగీత సేవలు నిరుపమానమని కొనియాడారు. వినరో భాగ్యము విష్ణుకథ, పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు, జగడపు జనువుల జాజర వంటి పాటలు తెలుగు జాతి ఉన్నంత వరకు అజరామరంగా నిలిచిపోతాయన్నారు. సంగీత పిపాసుల హృదయాలలో సుమధుర సంగీత లయను, హాయలను చిలకరించిన బాలకృష్ణప్రసాద్ మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని ఆయన జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే సభ సహాయ కార్యదర్శి నామసేవ హరికృష్ణ, డాక్టర్ ఎం .మాధవి తదితరులు బాలకృష్ణ ప్రసాద్ లలిత సంగీతం, జానపద,శాస్త్రీయ రంగాలకు చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: ఎంఎస్ఎంఈ సర్వేని వేగవంతంగా పూర్తి చేయాలని నగర పాలక సంస్థ సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సర్వేపై సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో 31,006 ఎంఎస్ఎంఈల సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇందులో 11,418 ట్రేడ్ లైసెన్స్ షాపులు ఉండగా, వాటిని సచివాలయాల వారీగా విభజించి సర్వే చేయాలన్నారు. వచ్చే గురువారం చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, ఆ లోపు సర్వేను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీల బదిలీలపై స్పష్టత లేమి

- ఏపీఎస్ఏపీఈఏ రాష్ట్ర నాయకుడు కె.నరసింహారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీ డ్రాఫ్ట్‌లో భాగంగా పీఈటీల బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఏపీఎస్ఏపీఈఏ) రాష్ట్ర నాయకుడు కె.నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 8 ఏళ్ల సర్వీస్ పూర్తయిన పీఈటీలు, అలాగే గతంలో జరిగిన బదిలీల్లో ఎస్ఏ (పీఈ) పోస్టుల్లో అగైనెస్ట్‌గా పని చేస్తున్న పీఈటీలను ఎలా కొనసాగించాలి అనే అంశాలపై ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మాదిరి బదిలీ డ్రాఫ్ట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. ఇదే అంశంపై గతంలో పలుమార్లు విద్యాశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అగైనెస్ట్‌గా పని చేస్తున్న పీఈటీలను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు శాశ్వత ప్రాతిపదికన బదిలీ చేయాలని కోరామన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు వ్యాయామ విద్యను తీసుకురావడం వల్ల భవిష్యత్తులో ఏపీ నుంచి ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. ఆ దిశగా ఆలోచించి ప్రాథమిక పాఠశాలల్లో పీఈటీ పోస్టులను మంజూరు చేయాలని కోరారు.

'క్లస్టర్ సమావేశం రద్దు చేయాలి'

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్, ఓపెన్ స్కూల్ పరీక్షల నేపథ్యంలో బుధవారం నిర్వహించనున్న పాఠశాల క్లస్టర్ సమావేశాన్ని రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు జరుగుతున్నాయని, చాలామంది టీచర్లు ఇంటర్, ఓపెన్ స్కూల్ పరీక్షల విధుల్లో ఉన్నారన్నారు. ఈ పరిస్థితులో ఈ నెల జరగాల్సిన పాఠశాల క్లస్టర్ సమావేశాన్ని రద్దు చేయడం ఉత్తమమన్నారు.

ఘనంగా వసంతోత్సవం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం స్వామి వారి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గవిమఠంలో ఉన్న దిగుడు బావి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం కంకణ మంటపంలో ఉంచి నవ ధాన్యాలను బయటకు తీసి కంకణాలను బావిలో వదిలేశారు. అనంతరం ఆలయ అర్చకులు, గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు పాటిల్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లల ఆట.. చేపల వేట!



చేపలు పట్టాయోచ్: దోమతెరతో చేపలు పడుతున్న చిన్నారులు



అదిగో చేప: చేపల వేట సాగిస్తున్న దృశ్యం



జరభద్రం: హెచ్చెల్సీ గట్టు ఎక్కుతున్న బాలుడు

తుంగభద్ర జలాశయం నుంచి నీటి విడుదల ఆగిపోవడంతో తుంగభద్ర ప్రధాన కాలువ(హెచ్చెల్సీ)లో నీరు తగ్గిపోయింది. దీంతో చిన్నారులు కాలువలో నీటితో ఆడుకోవడంతోపాటు చేపల వేట సాగించారు. అయితే కాలువకు లైనింగ్ ఉండటంతో కిందకు దిగేందుకు ప్రమాదకర ఫీట్లు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మహిళల స్వావలంబన కోసం చేయూత



నిరుపేద మహిళకు నిత్యావసరాలనందిస్తున్న నిర్మల

అనంతపురం కల్చరల్: మహిళా దినోత్సవం సందర్భంగా ఒంటరి, నిరుపేద మహిళలకు ఉచిత ఆవాసం కల్పిస్తున్నట్లు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు అధినేత్రి డాక్టర్ నిర్మల మురళి తెలిపారు. మంగళవారం పలు నిరుపేద కుటుంబాలకు ఆమె మూడునెలల సరిపడా 32 రకాల నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లు గడవని, ఆర్థిక స్థోమత లేని వాళ్ల కోసం ఆదర్శనగర్‌లో పుట్టినిల్లు ఆశ్రమాన్ని నిర్మించామని, అందులో వారికి స్వయం ఉపాధిపై శిక్షణ, ఉచిత వసతి కల్పిస్తామన్నారు. వేద, సౌదామణి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆజాద్‌నగర్‌లోని ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు నిర్వాహకులు లాల్‌బాషా, ముంతాజ్‌బేగంకు మంగళవారం షిర్డీసాయి అన్నవితరణ ట్రస్టు వారు రూ.12 వేలు విలువ చేసే నిత్యావసరాలను అందించారు.